
# పద్దుకు వేళాయెరా..

## రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే




న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

### ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

### స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

### పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

### సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

### ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

### హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

### సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

### సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

### గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

### చివరగా..

*ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్త దానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముమ్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.*

### ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం



వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేదోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

## బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

**వీ అనంత నాగేశ్వరన్:** ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

**మనోజ్ గోవిల్:** ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

**అజయ్ సేథ్:** ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

**తుహిన్ కాంత పాండే:** ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

**అరుణీష్ చావ్లా:** ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

**ఎం నాగరాజు:** త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.




बैंक ऑफ़ बड़ौदा
Bank of Baroda

## బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

## దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

## ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

**అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు**

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

**కనిపించని చిత్తశుద్ధి..**

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

## ఎన్‌ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్‌ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్‌ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

## రైతులకు పాకాల నీటిని వదలాలి



*ఇరిగేషన్‌శాఖ ఈఈతో మాట్లాడుతున్న కవిత*

గూడూరు, జనవరి 30 : పాకాల వాగు పరివాహక ప్రాంతంలో పంటలు వేసుకున్న రైతులకు నీటిని విడుదల చేయాలని మాజీ ఎంపీ మాలోత్ కవిత నీటిపారుదల శాఖ ఈఈకి గురువారం ఫోన్‌లో విన్నవించారు. మండల కేంద్రంలోని పాకాలవాగు పరివాహక ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు కవితను కలిసి తమ పంట పొలాలకు నీరిచ్చేలా చూడాలని కోరడంతో ఆమె ఈఈకి ఫోన్ చేసి రైతులు ఇబ్బందులను తెలియజేశారు. పాకాల చెరువు నుంచి నీటిని వదిలితే అవి పాకాల వాగులోకి నీరు చేరి పానుగోడు, అయోధ్యపురం, బొల్లెపల్లి, అప్పరాజుపల్లి, గోవిందాపురం తదితర గ్రామాల లబ్ధి జరుగుతుందని విన్నవించారు. ఇప్పటికే కొంతమంది రైతులకు రైతుభరోసా అందక, రుణమాఫీ కాక ఇబ్బంది పడుతున్నారని, ఇప్పుడు సకాలంలో నీటిని విడుదల చేయకపోతే పంట చేతికి రాక పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, సురేందర్, వెంకన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిని నిర్మూలించాలి : డీఎంహెచ్‌వో



*తొర్రూరు : కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో*

తొర్రూరు, జనవరి 30 : కుష్టు వ్యాధి నిర్మూలన కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని డీఎంహెచ్‌వో మురళీధర్ కోరారు. డీపీఎంవో వనాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తొర్రూరు ప్రభుత్వ దవాఖానలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుందని, ముందుగా గుర్తిస్తే నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మీరాజ్, జ్వలిత, మానస, నందన, బాలాజీ, మంగ మ్మ, సుందరి, కమల, మేరీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


**మరిపెడలో..**

మరిపెడ : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా జాతీయ రహదారిపై ర్యాలీ ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫిబ్రవరి 13వరకు జరిగే కుష్టువ్యాధి సర్వే అ వగాహన సదస్సు, కుష్టు వ్యాధి గ్రస్తులపై వివక్ష చూపబోమని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ స్వామి, కృష్ణ, సుదర్శన్, ఆ చార్యులు, లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

**కురవిలో..**

కురవి : ప్రజల సహకారం, ముందస్తు అవగాహన, సత్వర చికిత్సతో కుష్టు రహిత సమాజాన్ని నిర్మించుకోవచ్చని ఎంపీడీవో వీరాబాబు అన్నారు. కురవి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ కుష్ఠ నిర్మూలన అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ డీపీఎంవో ఎల్లయ్య, పీహెచ్‌సీల సిబ్బంది శ్రీహరి భద్రమ్మ, గౌసొద్దీన్, శోభ, రాజకుమారి, నీరజ పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ



*తొర్రూరు : హెల్మెట్లు పంపిణీ చేస్తున్న సీఐ గణేశ్*

తొర్రూరు, జనవరి 30 : రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో గురువారం తొర్రూరు పట్టణంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో వాహనదారులకు సీఐ గణేశ్, ఎస్సై ఉపేందర్ హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ గణేశ్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలన్నారు.

**రోడ్డు నియమాలు పాటించాలి**

నర్సింహులపేట, జనవరి 30: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై సురేశ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుంచి చౌరస్తా మీదుగా ర్యాలీ నిర్వహించారు. రాష్ డ్రైవింగ్, మైనర్ల వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



*సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత*

నెల్లికుదురు, జనవరి 30 : నూతన పెన్షన్ విధాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ మండల కార్యదర్శి భిక్షపతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్, యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌లు పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని వెంటనే రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని న్నారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగి చనిపోతే తప్ప పెన్షన్ వచ్చే అవకాశం లేదని, యూనిఫైడ్ పెన్షన్ స్కీం కూడా అదే కోవకు చెందినదని వాటిని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. స్థానిక సమస్యలపై మాట్లాడుతూ మధ్యాహ్న భోజనే కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన బిల్లులు, విద్యార్థులకు అందించే గుడ్డు ధరను పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాస్టి రమేశ్, మండల విద్యాశాఖ అధికారి రాందాస్, జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు భిక్షపతి, జయప్రకాశ్, స్రవంతి, సైదులు పాష తదితరులు పాల్గొన్నారు.

## గార్ల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కృష్ణవేణి



కృష్ణవేణి

గార్ల, జనవరి 30: గార్ల మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కే కృష్ణవేణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డోర్నకల్ తహసీల్దార్‌గా కృష్ణవేణి పని చేస్తున్నారు. నర్సింహులపేటలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సంజీవ గార్ల డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన సుధాకర్ నర్సింహులపేటకు బదిలీ అయ్యారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా హరిప్రసాద్



హరిప్రసాద్

ఇనుగుర్తి, జనవరి 30 : నూతనంగా ఏర్పడిన ఇనుగుర్తి మండలానికి తొలి ఇన్‌చార్జి ఎంపీడీవోగా కేసముద్రం ఎంపీవో హరిప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారనని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయనను పీఏసీఎస్ చైర్మన్లు దీకొండ వెంకన్న, గుండా వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీశ్, తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## నాయబ్ తహసీల్దార్‌గా సుధాకర్‌నాయక్



సుధాకర్ నాయక్

నర్సింహులపేట, జనవరి 30: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నాయబ్ తహసీల్దార్‌గా జరుపుల సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సంజీవ బదిలీపై గార్ల మండలానికి వెళ్లగా, గార్లలో పనిచేసిన సుధాకర్ నాయక్ బదిలీపై వచ్చారు.

## ఉపాధి కార్డులపై పూర్తి విచారణ చేయాలి



*ఎంపీవోకు వినతి పత్రం అంద చేస్తున్న వ్యకాస నాయకులు*

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 : మండలంలోని జంగిలికొండ గ్రామ పంచాయతీలో ఉపాధి జాబ్ కార్డులపై పూర్తిస్థాయి విచారణ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీవో పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. చనిపోయిన వారి పేరు మీద ఉన్న జాబ్‌కార్డులను తొలగించకుండా అదే కార్డ్‌ల మీద వారి మనవళ్లు, మనవరాళ్ల పేర్లతో ఐడీ నంబర్లను క్రియేట్ చేసినట్లు తెలిపారు. వారు చదువు రీత్యా హైదరాబాద్‌లో ఉన్నా, జాబ్ కార్డ్ ఆధారంగా పని చేసినట్లు హాజరు వేసి 4 సంవత్సరాలుగా డబ్బులను తీసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో నిజమైన లబ్ధిదారులకు పని లేకుండా అన్యాయం జరిగిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న ఉపాధి జాబ్ కార్డ్‌లపై పూర్తి విచారణ చేస్తే మరిన్ని అంశాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మల్లయ్య, కుమారస్వామి పాల్గొన్నారు

## 20న చలో హైదరాబాద్

కొత్తగూడ, జనవరి 30 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 20న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐల్లయ్య అన్నారు. ఈ మేరకు గురువారం కొత్తగూడ మండల కేంద్రంలోని పాలడుగుల కృష్ణ స్మారక భవనంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూర్క బుచ్చిరాములు, ఇడంపాక శ్రీశైలం, యాదగిరి, యుగేందర్, గజ్జి సోమన్న, సురేందర్, లింగన్న పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మండల సోషల్ ఆడిట్



*సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు*

మరిపెడ, జనవరి 30 : 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి సోషల్ ఆడిట్ కార్యక్రమం కొనసాగుతున్నది. గురువారం 14వ విడత సామాజిక తనిఖీని గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టారు. మండలంలోని 48 గ్రామాలకు చెందిన ఉపాధి హామీ పనులపై చేపట్టిన తనిఖీలో భాగంగా ఎడ్జెర్ల, తాళ్లఊకల్, ఎల్లంపేట, అబ్బాయిపాలెం, నీలికుర్తి, అనేపురం స్టేజీ, నేతవాత్ తండ, తండధర్మారం, పురుషోత్తమయగూడెం, బాలీనీ ధర్మారం, దంటకుంట తండ, బుర్హాన్‌పురం, గాలివారిగూడెం, గిరిపురం, సోమ్లతండాలో చేపట్టిన సామాజిక తనిఖీల్లో పలు అంశలు వెలుగులోకి వచ్చాయి. మస్టర్లు, ఆన్‌లైన్ నమోదులో తప్పులు, మాన్యువల్ హాజరులో తేడాలు, పని చేసిన ప్రదేశంలో కొలతలతోపాటు వివిధ అంశంలపై తేడాను గుర్తించినట్లు చెప్పారు. అనంతరం పీడీకి వినతి పత్రం అందజేశారు. ఈ సామాజిక తనిఖీలో డీఆర్‌డీవో మధుసూదన్ రాజు, డీవీసీ మన్మోహన్, అంబుడ్స్‌పర్సన్. ఆదామ్, ఏఆర్‌లు తదితరులు పాల్గొన్నారు.

### హత్య కేసులో
## ఒకరి అరెస్టు

కేసముద్రం , జనవరి 30 : మండలంలోని వెంకటగిరి గ్రామంలో భార్యను హత్య చేసిన ఘటనలో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వెంకటగిరికి చెందిన వాంకుడోత్ రఘు తన భార్య సుగుణ వివాహేతర సంబంధం కలిగి ఉన్నదనే అనుమానంతో ఇటీవల కత్తితో దాడి చేయగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పరారీలో ఉన్న రఘును పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు.



*బిచ్యానాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవిత, నాయకులు*

## రవికుమార్‌కు పరామర్శ

గూడూరు, జనవరి 30 : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బానోత్ రవికుమార్‌ను జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత గురువారం పరామర్శించారు. రవికుమార్ తండ్రి బిచ్యానాయక్ అనారోగ్యంతో రెండు రోజల క్రితం మృతిచెందారు. ఆమె వెంట రాష్ట్ర నాయకుడు బీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి, పరకాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ముత్యం వెంకన్న, పొన్నాల యుగేంధర్, మహబూబ్‌పాష, సంపత్‌రావు, సురేందర్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



*నివాళులర్పిస్తున్న పుట్ట మధు*

కేసముద్రం, జనవరి 30: పెద్దపల్లి జిల్లాలో ఓ దినపత్రికకు స్టాఫ్ రిపోర్టర్ గా పని చేస్తున్న కేసముద్రం మండల కేంద్రానికి చెందిన గుడ్ల శ్రీనివాస్‌ను పెద్దపల్లి జిల్లా మాజీ జడ్పీచైర్మన్, మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకుడు పుట్ట మధు గురువారం పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## ఆరు గ్రానైట్ లారీల సీజ్

కురవి, జనవరి 30 : కురవి మండల కేంద్రం మీదుగా అధిక లోడ్‌తో వెళ్తున్న ఆరు గ్రానైట్ లారీలను సీజ్ చేసినట్లు గురువారం ఎస్సై గండ్రాతి సతీశ్ తెలిపారు. అధిక లోడ్‌తో ప్రమాదకంగా వెళ్తున్న ఆరు లారీలను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

మరిపెడ, జనవరి 30 : ఉపాధి పథకంలో పనిచేస్తున్న లక్ష్మ తండా ఫీల్డ్ అసిసెంట్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గురవారం పీడీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గండి బుచ్చిబాబు, అనిల్, మనోజ్, నవీన్, శివలింగయ్య, ఆశోక్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నర్సింహులపేట, జనవరి 30: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని శ్రద్ధగా చదువుకోవాలని ఎంఈవో రామ్మోహన్ రావు సూచించారు. గురువారం టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేశారు. ఈ చింత సురేశ్, నరసింహారెడ్డి, వెంకన్న, యాకయ్య, రమేశ్ పాల్గొన్నారు.

## బేగావత్ తండాలో చోరీ

కురవి, జనవరి 30 : కురవి మండలం మోద్గులగూడెం శివారు బేగావత్ తండా గ్రామానికి చెందిన భూక్యా వీరన్న, మంగమ్మ ఇంట్లో సుమారు రూ.9లక్షల నగదు గురువారం చోరీకి గురయ్యాయి. సునార్‌తండాకు చెందిన కటారియ విజయ్ అనే వ్యక్తి భూక్యా వీరన్న వద్ద తీసుకున్న అప్పు చెల్లించడంతో నగదును ఇంట్లోనే పెట్టుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నగదును అపహరించారు. విషయం తెలుసుకున్న సీరోలు ఎస్సై నగేశ్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.